క్లుప్తంగా

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించండి

కలెక్టర్ అరుణ్‌బాబును కోరిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట: నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కోరారు. పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ సోమవారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువ కప్పి సత్కరించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. రాష్ట్రాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. అందుకు కలెక్టర్‌గా తోడుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు వేల్పుల సింహాద్రి, దేశిరెడ్డి చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కులపై పెద్దలకు అవగాహన కల్పించాలి



యడ్లపాడు: స్థానిక మండల ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఐసీడీఎస్ అధికారులు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎం. నాగరత్నం మాట్లాడుతూ బాలల హక్కులు, వారి సంరక్షణ, బాల్య వివాహాల వలన జరిగే నష్టాలపై వివరించారు. ఆయా విషయాలను వారి తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు ఎం.జోజమ్మ, కె.వెంకట రమణ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

దేవస్థాన భూములకు కౌలువేలం నిర్వహించాలి

నాదెండ్ల: అప్పాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న దేవదాయశాఖ భూముల కౌలు వేలం త్వరలో నిర్వహించాలని గ్రామానికి చెందిన రైతులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అంకమ్మ తల్లి దేవస్థానం ఆధీనంలో ఉన్న సర్వే నెం.1423లోని 9.54 ఎకరాలు భూమి ఉందని, 2019లో ఒకసారి దేవదాయశాఖ అధికారులు కౌలువేలం నిర్వహించారని, మరలా మూడేళ్లు నిర్వహించ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ భూమిలో కొంతమంది అక్రమంగా దున్ని సాగు చేసేందుకు సిద్ధమౌతున్నారని, దీని వలన దేవదాయశాఖకు సుమారు రూ. 1.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులు మొక్కలు నాటుతున్నారన్నారు. దేవదాయ శాఖలోనే కొందరు అధికారులు కావాలనే తాత్సారం చేస్తున్నారన్నారు. అక్రమంగా భూమిని దున్నిన రైతులకు సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూములకు త్వరగా కౌలు వేలం నిర్వహించాలని కోరారు.

విద్యా సామగ్రి వితరణ

శావల్యాపురం: శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ తల్లి సేవా సమితి వారి ఆధ్వర్యంలో మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లోని 40 మంది విద్యార్థులకు విద్యా సంవత్సరానికి సరిపడా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు, ప్యాడ్లు, జామెంట్రీలు తదితర విద్యాసామగ్రిని సోమవారం అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ సేవా సమితి సభ్యులు బోడాల వీరయ్య, ప్రధానోపాధ్యాయులు నూకల శ్రీనివాసరావు, ఎస్.కె.రబియా,ఉపాధ్యాయులు ఫాతిమా, మేరీ, సీఆర్‌పి సేవా సమితి సభ్యులు ఏలికా శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అరుణాచలంకు బస్సులు

వినుకొండ(నూజెండ్ల): ఈ నెల 21వ తేదీ మహా పౌర్ణమి సందర్భంగా వినుకొండ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా సూపర్‌లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం కోటేశ్వరనాయక్ తెలిపారు. ఈ నెల 19వ తేదీ శుక్రవారం రాత్రి 9గంటలకు బయల్దేరి శని వారం ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం కాణిపాకం వినాయక దర్శనం, సాయంత్రం 6గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపులు అనంతరం 21న ఆదివారం ఉదయం 5గంటలకు అరుణాచలం దర్శనం చేసుకున్న తరువాత 22 తేదీ సోమవారం ఉదయం 4 గంటలకు వినుకొండకు చేరుకుంటారని తెలిపారు. టిక్కెట్ ధర ఒక్కొక్కరికీ రూ.2550లు అని, ముందస్తుగా రిజర్వేషన్ సదుపాయం కలదని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7382825431, 7382898320 నంబర్లను సంప్రదించాలన్నారు.

భార్య ఫిర్యాదుతో భర్తకు కౌన్సెలింగ్

నాదెండ్ల: నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై జె.బలరామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఒక సమస్య పరిష్కరించారు. చందవరం గ్రామానికి చెందిన మహిళ తన భర్త ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి తనను వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన పోలీసులు సదరు మహిళ భర్తను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

స్ఫూర్తిప్రదాత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- నియోజకవర్గంలో ఘనంగా వైఎస్సార్ 75వ జయంతి
- పలుచోట్ల విగ్రహాలకు పూలమాలలు, కేకులతో నివాళులు అర్పించిన నేతలు, అభిమానులు, కార్యకర్తలు
- పేద మహిళలకు చీరలు, పులిహోర పంపిణీ
- ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ శ్రేణులు



ప్రకాష్‌నగర్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు



సొలస గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నేతలు



రెడ్డినగర్‌లో మహానేత డాక్టర్ వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చిలకలూరిపేటలో రాజన్నకు నివాళులు అర్పిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా



నూజెండ్ల మండలం ఉప్పలపాడులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నక్కా నాగిరెడ్డి



లింగారావుపాలెంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వైఎస్సార్‌సీపీ పార్టీకి స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకొని సోమవారం నియోజకవర్గంలో డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. పట్టణంలో పది విగ్రహాలతో పాటు 90 శాతం గ్రామాల్లో వేడుకలు చేశారు. తొలుత ప్రకాష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి భారీ కేకు కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. వైఎస్సార్ జిందాబాద్, అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. 11వ వార్డు ఇన్‌చార్జి సానికొమ్ము రమణారెడ్డి నాయకత్వంలో ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి కేకు కట్‌చేసి 100 మంది పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు.

- రామిరెడ్డిపేట డాక్టర్ వైఎస్సార్ రహదారి ప్రవేశ ద్వారం, పాతసమితి కార్యాలయ సెంటర్, కాకుమాను చినపేరిరెడ్డి రహదారిలోని విగ్రహాలకు నివాళులు అర్పించి కేకులు కట్‌చేశారు. బరంపేట మిట్టబజారులోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి పులిహోర పంపిణీ చేశారు.
- సత్తెనపల్లిరోడ్డులోని బీసీ కాలనీ, సీబీ కాలనీలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో షేక్ ఖాజావలి మాస్టారు, ఐయం.స్వామి, కామిరెడ్డి నరిసిరెడ్డి, సానికొమ్ము కోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నూరుల్ అక్తాబ్, భూమిరెడ్డి కొండారెడ్డి, మాగులూరి రమణారెడ్డి, షేక్ రెహమాన్, సయ్యద్ మహబ్బి, కందుల ఎజ్రా, జి.అచ్యుతరావు, హాలీవుడ్ రఘు, సయ్యద్ బాజి, మిట్టపల్లి శేఖర్, ఎస్‌కే అంజనేయులు, ఢిల్లీ నాయుడు, పీడీ కృష్ణారెడ్డి, సానికొమ్ము సుబ్బారెడ్డి, కేసరి కోటిరెడ్డి, పూనూరి కోటిరెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, యేరువ బాలమోహనరెడ్డి, పంగులూరి విజయకుమార్, మూరే రవీంద్ర, కనకాపుల్లారెడ్డి, పుల్లంశెట్టి శ్రీనివాసరావు, షేక్ గౌస్, ఖాజా, కంచర్ల హనుమంతరావు, రవి, రామిరెడ్డి, మక్కెళ్ల ఆంజనేయులు, హిదాయిత్ పాల్గొన్నారు.

దార్శనికుడు రాజన్న

యడ్లపాడు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మైదవోలు మార్గంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలు మాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి రాచమంటి చింతారావు, ఎంపీటీసీ సభ్యులు సయ్యద్ సుభాని, నాయకులు పిడతల దయాసాగర్, పందుల బుల్లెబ్బాయి, బోడియ పాల్గొన్నారు.

సొలస గ్రామంలో...

గ్రామంలోని సచివాలయం వద్ద మాజీ ఎంపీపీ ఎంవీ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో, ఉత్తరబజార్‌లోని రంగనాయక యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి ఉత్సవాలు సోమవారం జరిగాయి. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు పాలూరి శ్రీనివాసరెడ్డి, మద్దూరి సంజీవరెడ్డి, గుండ్లకుంట కోటిరెడ్డి, బొజ్జ శివకోటి, గండు వీరయ్య, కారసాల వీరయ్య, దావల ఆనందరావు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలం కేంద్రం శావల్యాపురంలో మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అభిమానులు ఘనంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జాతీయ రహదారి వెంబడి ప్రధాన కూడలి మార్గంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మండల కన్వీనర్ భీమని అంకారావు గ్రామపార్టీ అధ్యక్షులు దేవనబోయిన వీరనారాయణ, మండల కన్వీనర్ భీమని అంకారావు, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఉప సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట రూరల్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరెడ్డి 75వ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్‌లుకట్ చేశారు. కోటప్పకొండ యోగివేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలోని వైఎస్సార్ విగ్రహానికి సత్రం కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సత్రం కమిటీ కార్యదర్శి చేగిరెడ్డి ఈశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు కర్నాటి సాంబిరెడ్డి పాల్గొన్నారు. రెడ్డినగర్‌లో ప్రధాన కూడళ్లలోని వైఎస్సార్ విగ్రహాల వద్ద జయంతి కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ కోటపాటి రవీంద్రారెడ్డి, వెన్నా చిన్నపురెడ్డి, వెన్నా లక్ష్మిరెడ్డి, కాసు జనార్ధన్‌రెడ్డి, గంటా మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఎస్‌పీ కాలనీలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు మండలంలో నిర్వహించారు. మండలంలోని జయంతి రామాపురం, మేళ్లవాగు, రేమిడిచర్ల, రావులాపురం, గండిగనుమల, గుట్లపల్లి, వెల్లటూరు, బొల్లాపల్లి తదితర గ్రామాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో రాజన్న విగ్రహాలకు పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహాల వద్ద కేక్ కట్ చేసి రాజన్న జయంతిని నిర్వహించారు. పలు గ్రామాల్లో పులిహోర పంపిణీ అన్న సంతర్పణ చేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: రాష్ట్ర చరిత్రలో జనరంజక పాలనతో అందరి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకుని గణపవరం పోలేరమ్మ గుడి సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం యువత బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, కౌన్సిలర్లు తులం సుధాకర్, ఆదంవలి, పిల్లి సాగర్‌బాబు, కాటా రత్తయ్య, పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ (నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసిన ఘనత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ ఐక్యమత్యంగా ముందుకు సాగాలని బొల్లా పిలుపునిచ్చారు. అనంతరం చెక్‌పోస్టు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఐదు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిపాలన దక్షతలో ఎన్నో సంస్కరణలు తెచ్చి అన్నివర్గాల ప్రజలకు సంక్షేమాలు ఇచ్చి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచిన మహానేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని నియోజకవర్గ యోగి వేమారెడ్డి సేవా సమితి అధ్యక్షులు ఆరె శివారెడ్డి అన్నారు. సమితి ఆధ్వర్యంలో పట్టణంలో వైఎస్సార్ 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్, వేమన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ సుధాకరరెడ్డి, ట్రెజరర్ రామిరెడ్డి, మూలె వెంకటేశ్వర రెడ్డి, ఎంపీపీ వెంకటరామిరెడ్డి, ములకా రామ తులసిరెడ్డి, గంధం బాలిరెడ్డి, రామకృష్ణారెడ్డి, బలరామిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, జయరామ్ రెడ్డి, సోము వెంకటేశ్వరరెడ్డి, ఫాతిమారెడ్డి, రవీంద్రారెడ్డి, బిక్కం వెంకట నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలో...

మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నూజెండ్ల మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, సర్పంచ్ కట్టెంపూడి ఆదిలక్ష్మి బెన్నయ్య, ఎంపీటీసీ దూపాటి వెంకమ్మ గాలెయ్య తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, జేనేపల్లి నాగరాజు, సింగం శ్రీనివాసరెడ్డి, లక్కిరెడ్డి వెంకటరెడ్డి, గొంగటి శ్రీనివాసరెడ్డి, నంబల రవి, కోటిలింగం, గోపియాదవ్, కట్టెంపూడి పిచ్చయ్య, సిద్దల పెద్దోడు, ఏపనగండ్ల నాగేశ్వరరావు, రాయపూడి వెంకటేశ్వర్లు అభిమానులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వి.అప్పాపురం, తలార్లపల్లి, రవ్వారం, గాంధీనగరం, మారెళ్లవారిపాలెం, నూజెండ్ల గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో వైఎస్సార్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

రైతుబాంధవుడికి ఘననివాళి

యడ్లపాడు: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్ని యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యాలయం, బీసీ సెంటర్, ఎస్సీకాలనీల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, షేక్ మాబుసుభాని, కనపర్తి పెద్ద సుబ్బారావు, ఆలోకం శ్రీనివాసరావు, మండెపూడి శ్రీనివాసరావు, కోయ రామోజీ, కొల్లా పేరయ్య, మద్దు శ్రీనివాసరావు, విప్పర్ల రామారావు, షేక్ అస్లాం, గుడికందుల బుచ్చియ్య పాల్గొన్నారు. అలాగే పుట్టకోట గ్రామంలోనూ పార్టీ నాయకులు జయంతి వేడుకలను నిర్వహించారు.



చెక్‌పోస్టు సెంటర్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా



కోటప్పకొండ రెడ్ల సత్రం వద్ద మహానేతకు నివాళులు అర్పిస్తున్న సత్రం కమిటీ సభ్యులు



గణపవరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ప్రజల హృదయాల్లో సజీవుడు డాక్టర్ వైఎస్సార్

చిలకలూరిపేట: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే సామాన్యుల జీవితాలకు ఒక భరోసా అని, ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భాస్కర్ సెంటర్‌లోని డాక్టర్ వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గేరాలింకన్, షేక్ కరిముల్లా, తాళ్ల అంజిరెడ్డి, నిడమానూరు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏవీఎం సుభాని, కల్లి వెంకటరెడ్డి, షేక్ అల్లీమియా, సయ్యద్ హిదాయతుల్లా, మాజేటి నరేంద్ర, గ్రంధి అంజనేయులు, బైరా వెంకటకోటి, కల్లూరి బుజ్జి, సయ్యద్ జమీర్, పెన్నా సాంబశివరావు, గట్టా రమేష్, వేజర్ల కోటేశ్వరరావు, మానుకొండ అక్కిరెడ్డి, కొండవీటి ఆంజనేయులు, దాసరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా ఆధ్వర్యంలో పట్టణంలోని తూర్పు మాలపల్లెలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. వార్డు కౌన్సిలర్ యడ్ల ఇందిరా పాల్గొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో స్థానిక పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులు అర్పించారు.



చిలకలూరిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



బరంపేట మిట్టబజారులో పులిహోర పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



యడ్లపాడులో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న పార్టీ నాయకులు



శావల్యాపురంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అభిమానులు



లింగంగుంట్ల కాలనీలో మహానేత డాక్టర్ వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి

సహకార సంఘాలకు చేరిన ఎరువులు

ప్రభుత్వ ధరలకే రైతులకు అందుబాటులోకి..

నాదెండ్ల: రైతులకు అందుబాటులోకి రసాయనిక ఎరువులు వచ్చాయి. గణపవరం, నాదెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రైతులకు ఎరువులు విక్రయించనున్నారు. రెండు సొసైటీలకు కోరమండల్ యూరియా 40 టన్నుల చొప్పున సోమవారం గోడౌన్‌లకు చేరాయి. 50 కేజీల బస్తా ధర రూ.260లుగా నిర్ణయించినట్లు సీఈవోలు పెదవల్లి లక్ష్మయ్య, టి.అంజయ్యలు తెలిపారు. మరికొన్ని రోజుల్లో అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో రానున్నాయని, ప్రభుత్వం సహకార సంఘాల ద్వారానే ఎరువుల పంపిణీకి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి రైతులకు నిర్ణీత ధరల్లోనే ఎరువులు అందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాపై ఉక్కుపాదం మోపండి

నరసరావుపేట: నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలకు విముక్తి కల్పిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి ఐదో వార్డు క్రిస్టియన్‌పాలెం, ఎనిమిదవ వార్డు ఇస్లాంపేటలో కబ్జాకు గురైన స్థలాలను పరిశీలించారు. తమ పాలనలో పేదలకు తొలి ప్రాధాన్యం ఇస్తామని, ప్రభుత్వ ఆస్తులు ఎవరి ఆక్రమణలో ఉన్నా ఉపేక్షించబోమన్నారు. నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను తక్షణమే స్వాధీనంలోకి తీసుకోవాలని అధికారులను సూచించారు. క్లీన్ నరసరావుపేట లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని పలు వార్డులో అధికారులతో కలిసి పర్యటించారు. కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, నాయకులు వాసిరెడ్డి రవి, పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

చిరుమామిళ్ళ పాఠశాలలో ఎంఈవో తనిఖీ

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని, వంటగది, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాజా కూరగాయలు, వంట దినుసులు వినియోగించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

మిరప రైతులు పీఎండీఎస్ కింద నవధాన్యాలు సాగు చేయండి

ప్రధాన పంట వేసిన రైతులకు అంతర్గత పంటలు వేయాలని సూచన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వెంకట్రావు, అమలకుమారి

యడ్లపాడు: మిరప రైతులు తమ ప్రధాన పంట సాగుకు ముందుగా చిరుధాన్యాలు, నవధాన్యాలను పీఎండీఎస్ కింద చేయాలని రైతుసాధికార రాష్ట్ర సమన్వయకర్త ఎస్ వెంకట్రావు సూచించారు. మండలంలోని సొలస, ఉన్నవ గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్ని అధికారులు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా డీపీఎం కె.అమలకుమారితో కలిసి ఆయా సాగు విధానాన్ని పరిశీలించారు. రుతుపవనాలకు ముందుగా పీఎండీఎస్ కింద 30 రకాల విత్తనాలైన చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నవధాన్యాలు సాగు చేసుకోవచ్చారు. వీటి వలన ఆదాయంతో పాటు భూమి ఆరోగ్యం మెరుగుతుందన్నారు. ప్రధాన పంట సాగుకు మంచి పోషకాలు లభించి పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు సాధించుకోవచ్చన్నారు. జిల్లాలో పీఎండీఎస్ కింద 57 వేల ఎకరాల సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటికే 22వేల ఎకరాలు రైతులు చేసినట్లు తెలిపారు. మిరప రైతులు పీఎండీఎస్ వేసుకునే వెసులుబాటు ఉందన్నారు.

గాంధీతత్వంపై అధ్యయనం జరగాలి



గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జర్నలిస్టు, గ్రంథకర్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

నరసరావుపేట రూరల్: నేటి ప్రపంచం, సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు సమాధానం, పరిష్కారం గాంధీతత్వంలో లభిస్తుందని జర్నలిస్టు, బహు గ్రంథకర్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ తెలిపారు. లింగంగుంట్ల కాలనీలోని గాంధీవనంలో గాంధీ స్మారక సమితి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన గాంధీ అధ్యయన కేంద్రాన్ని డాక్టర్ వేణుగోపాల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు, యువత గాంధీ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలన్నారు. మన దేశంలో కంటే అమెరికా తదితర దేశాలలో గాంధీ సిద్ధాంతాలపై ఎంతో పరిశోధన జరుగుతుందని తెలిపారు. అటువంటి అరుదైన పుస్తకాలను సేకరించి ఈ కేంద్రంలో ఉంచడం ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమంలో అతిథులుగా మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, స్వర్ణ రామిరెడ్డిలు పాల్గొన్నారు. డాక్టర్ నాగసూరి రచించిన గాంధీయ మార్గం, నేటి తరానికి రోల్‌మోడల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.